నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

1

శుక్రవారం | జనవరి 24, 2025 | www.navatelangana.com

ఎస్సై శ్రీకాంత్‌కు సన్మానం

తిర్యాణి :ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎంబడి శ్రీకాంత్‌ను గురువారం మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటు ప్రజలతో అటు ప్రభుత్వంతో మమేకమై ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో పాత్రికేయులదే ముఖ్య పాత్రని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తమ దష్టికి తీసుకురావాలని పాత్రికేయులను కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తాళ్ల వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, గాజుల లక్ష్మణ్‌గౌడ్, సీనియర్ పాత్రికేయులు మడావి నాగేశ్వర్, కడతల సాయి, యంసాని భాస్కర్, కొమురం రాజు, నాగపూర్ మహేంద్ర గౌడ్, మూలమట్టం శివప్రసాద్, దుర్గం పవన్, కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.



మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి ఆదిలాబాద్ జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, చేనేత పద్మ సమైక్య జిల్లా అధ్యక్షులు మోర ఆశన్న, ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బూర్ల శంకరయ్య, ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు చిప్ప గంగన్న, తెలంగాణ పద్మశాలి సంఘం జిల్లా కో కన్వీనర్ మెంచు ఆశన్న పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 25 నుండి 28 వరకు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దాగం రాజారాం అన్నారు. గురువారం స్థానికంగా మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గ్రౌండ్‌లో బహిరంగ సభను నిర్వస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు దేశంలోని పార్టీ అగ్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, బానేష్, లక్ష్మణ్, శంకర్, వెంకటేశం, బాపు శంకర్, రాములు, పోశయ్య శ్రీను, దుర్గయ్య బుచ్చయ్య, రవీందర్, తిరుపతి, తమ్మినేని శ్రీను, రాగులయ్య తొగరి శ్రీను, లింగయ్య, స్వామి పాల్గొన్నారు.

అసహనానికి గురి కావద్దు.. దరఖాస్తుకు అవకాశం ఉంది



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లిస్టులో పేరు లేనంత మాత్రాన అసహనానికి గురి కావల్సిన అవసరం లేదని, మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. శివ్వారం, పొనూర్, కుందారం, నర్సింగాపూర్‌లలో ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ లిస్టుల్లో తమ పేరు లేదని కొందరు అసంతృప్తి వ్యక్తం చేయగా ఎంపీడీఓ వారితో మాట్లాడుతూ మరో మారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఇంటింటి సర్వే సమయంలో పూర్తి స్థాయి సమాచారం ఇచ్చినప్పటికీ లిస్టులో పేరు లేకపోవడం ఏమిటని గ్రామీణులు ప్రశ్నించారు. తప్పొప్పులు సరి చూసుకున్న తర్వాతనే లిస్టు తయారు చేయాల్సి ఉండేదని తెలిపారు. ప్రజాపాలన పేరుతో మరో మారు మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కుందారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో పేర్లు లేకపోవడంతో అర్హులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పథకాల అమలుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలోని విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో రవాణాశాఖ అధికారి సంతోష్ కుమార్‌తో కలిసి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, డైట్ చార్జీలు పెంచి నూతన మెనూ అమలు చేస్తూ పోషక విలువలు గల ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రవాణా అధికారి విద్యార్థులకు వేడి నీటి కొరకు 2గీజర్లు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి, ఏబీసీడబ్ల్యుఓ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఇంగ్లీష్ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమ పురోగతిని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి ఖుష్బు గుప్తా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి సంబంధించిన తాజా వివరాలు, వివిధ పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలు, విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషపై ఆసక్తిని పెంపొందించే విధానాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏసీఎంఓ జగన్, విభాగ ప్రోగ్రామ్ మేనేజర్ వీరనారాయణ, టీమ్ సభ్యులు విజయ్ కుమార్, లక్ష్మణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వర్గీకరణే మాదిగల అంతిమ లక్ష్యం

- కొందరు స్వార్థపర మాలలే అడ్డుపడుతున్నారు
- ఇంటికొకరు డప్పుతో రావాలి..రాజధాని దద్దరిల్లాలి
- అమలు చేస్తామని చెప్పిన సీఎం మాట నిలబెట్టుకోవాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- ఆదిలాబాద్‌లో డప్పుదరువులతో సన్నాహక సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్సీ వర్గీకరణ సాధించడమే మాదిగల అంతిమ లక్ష్యం కావాలి. మీ బిడ్డల భవిష్యత్తు కోసం ఇంటికొకరు డప్పు భుజాన వేసుకొని రావాలి..డప్పుల మోతతో రాష్ట్ర రాజధాని హైదరాబాదు మారుమోగిపోవాలి..వచ్చే నెల వరకు వర్గీకరణ సాధించుకొని తీరాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు దేశంలోని అన్ని పార్టీలు మద్దతిచ్చాయని.. 59 ఎస్సీ కులాల్లో 58 కులాలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. కొందరు స్వార్థపర మాలలే అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాదులో తలపెట్టిన వేల గొంతులు- లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అధ్యక్షతన గురువారం ఆదిలాబాద్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మాదిగలు డప్పులతో భారీ ఎత్తున తరలివచ్చి మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వివిధ కూడళ్ల గుండా ర్యాలీగా ఎస్టీయూ భవనానికి చేరుకున్నారు. అంతకుముందు స్థానిక జగ్జీవన్‌రాంచౌక్‌లో విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎస్టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని..ఇప్పటికే పంజాబ్, హర్యాణ, తమిళనాడు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా అమలు చేస్తానని చెప్పారని.. ఈ రాష్ట్రంలో మాత్రం ఎందుకు ఆగిపోతోందని ప్రశ్నించారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీం తీర్పును అమలు చేస్తామని దేశంలో అందరి కంటే ముందు స్పందించారని తెలిపారు. వ్యక్తిగతంగా ఆయన వర్గీకరణకు అనుకూలమేనని పలుమార్లు ఎమ్మార్పీఎస్ సభలకు ఆయన మద్దతిచ్చారని గుర్తుచేశారు. మాదిగల మద్దతుతోనే రేవంత్‌రెడ్డి రాజకీయంగా బలపడ్డారని చెప్పారు. కానీ కమిటీలు, కమీషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని వర్గీకరణ చేయకుండానే 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యం అధికంగా ఉంటుందని వారు సీఎం కూడా శాసిస్తున్నారని పేర్కొన్నారు. 30 ఏండ్ల నుంచి పోరాటం చేస్తున్న నా ఒంటి మీద నల్లకండువా తప్పితే మరేది మారలేదని.. నా జాతి బిడ్డల భవిష్యత్తు కోసం తిరుగుతున్నానని చెప్పారు. వర్గీకరణ చేస్తామంటేనే అన్ని పార్టీలకు మద్దతిచ్చానని వివరించారు. ఇటీవల కేంద్రం అఫిడవిట్ ఇవ్వడంతోనే మాకు న్యాయం జరిగిందని నా జాతిని గెలిపించుకోవడమే లక్ష్యమని తేల్చిచెప్పారు. మాలల్లో కొంతమంది స్వార్థపరులు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని 15శాతం రిజర్వేషన్‌లో 4శాతం పొందాల్సిన మాలలు 12శాతం పొందుతున్నారని తెలిపారు. 10శాతం పొందాల్సిన మాదిగలు కేవలం 3శాతం మాత్రమే పొందుతున్నారని చెప్పారు. మిగిలిన ఉప కులాల బతుకులు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు వేసిన మూడు కమీషన్లు కూడా వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇచ్చాయని తెలిపారు. కాంగ్రెస్‌లో ఉన్న మాలలే అడ్డుపడుతున్నారని చెప్పారు. తెలంగాణలో 70శాతం ఉన్న మాదిగలను 20శాతం కూడా లేని వారు రెచ్చగొడుతున్నారని తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే వేల గొంతులు- లక్ష డప్పులు కార్యక్రమానికి మాదిగలు ఇంటికొకరు డప్పు తీసుకొని రావాలని పిలుపునిచ్చారు.



డప్పుదరువులతో భారీ ర్యాలీ

వేల గొంతులు- లక్ష డప్పులు కార్యక్రమానికి సన్నాహకంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాదిగలు డప్పు దరువులో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో ప్రారంభమైన ఈ మహా ప్రదర్శన నేతాజీచౌక్, వినాయక్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్ గుండా ఎస్టీయూ భవనం వరకు సాగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ డప్పు కొట్టి అందరినీ ఉత్సాహ పరిచారు. దారి పొడవున మాదిగలు డప్పుదరువులతో హోరెత్తించారు. అనంతరం కళాకారులు గిద్దెరాంనర్సయ్య బృందం పాటలతో అలరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి బుర్రి సతీష్ మాదిగ, బీజేపీ నాయకులు పాయల్ శరత్, మాదిగ, ఉప కులాల నాయకులు పసుపుల రాజు, పసుల శ్రీకాంత్, పండరి, శంకరమ్మ, కుడాల స్వామి, కాంబ్లే బాలజీ, ప్రేమ్‌రాజ్, చందాల రాజన్న, జిల్లపెల్లి నవీన్, బర్కుంట సుభాష్, తరూడిశంకర్, వినయ్‌సాగర్, గుర్రాల ఆశన్న, మెడిపల్లి మనోజ్, గైక్వాడ్ సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 17, 18 వార్డులలో నిర్వహించిన వార్డు సభలలో కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేస్తామని తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అర్హులకు పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ ఎంపీడీఓ, ప్రజాపాలన సేవా కేంద్రాలు, గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత, రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించి పథకం వర్తింపజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 24వరకు గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితాను చదివి వినిపించిన అనంతరం జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

కార్మిక హక్కుల కోసం పోరాడేది సీఐటీయూనే



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడేది సీఐటీయూ అని ఆ సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురువారం గంజాల్ టోల్ ప్లాజా యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందుగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులందరూ సీఐటీయూలో చేరండని పిలుపునిచ్చారు. నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం సీఐటీయూ అని దేశంలోనే అత్యధిక సభ్యత్వంతో అగ్రగామి కార్మిక సంఘంగా ముందు ఉన్నదని తెలియజేశారు. పఠాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ నాయకులపై గతంలో హరీశ్‌రావు, నాయిని నర్సింహరెడ్డి లాంటి పెద్ద పెద్ద ప్రజా ప్రతినిధులను చిత్తు చిత్తుగా ఓడించిన చరిత్ర సీఐటీయూకు ఉందన్నారు. నేటికీ అంగన్‌వాడీ, ఆశాలు, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ, రవాణా రంగ కార్మికుల, హమాలీ, మున్సిపల్, జిల్లాలోని అనేక రంగాల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీఓను సవరించి కార్మికులందరికీ రూ.26 వేలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు, గంజాల్ టోల్ ప్లాజా కార్మికులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నాయకులు రాజేష్, గంజాల్ టోల్ ప్లాజా అనుబంధ కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు రమేష్, గంగాధర్, రాజేశ్వర్, నవీన్, రవి, రాజకుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఘనంగా సంవిధాన్ గౌరవ అభియాన్

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో గురువారం సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయన్నారు. పార్టీ కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సతీష్, ఆశన్న, వెంకటేష్, కిషన్, అమర్‌నాథ్, దీపక్, విఠల్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటో లేదని నిరసన



నవతెలంగాణ-తాంసి

భీంపూర్, తాంసి మండలాల్లోని గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభల నిర్వహణ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు నిరసన తెలియజేశారు. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన పేర్లను చదివి వినిపించారు. పొన్నారిలో జరిగిన గ్రామసభను డీఎస్పీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. తాంసి, పొన్నారి గ్రామాలలో కొనసాగిన ప్రజాపాలన కార్యక్రమాలలో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే ఫొటో ఫ్లెక్సీపై లేకపోవడంతో నిరసన తెలియజేసి అధికారులను నిలదీశారు. తాంసి గ్రామంలో కొనసాగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను గ్రామ సభలోనే నిర్ణయించాలని గ్రామస్తులు వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎంపీడీఓ మోహన్‌రెడ్డిని నిలదీశారు. తాంసి ఎస్సై రాధిక గ్రామస్తులను సముదాయించి గ్రామసభ కొనసాగే విధంగా చూడాలని కోరారు. అనంతరం గ్రామసభ యథావిధిగా కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ గడ్డం మోహన్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ లక్ష్మి నలంద ప్రియ, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

డ్యూటీకి అనుమతించకుండా వేధింపులు

- ఫ్లంబర్ తల్లి సమ్మక్క ఆరోపణ



నవతెలంగాణ-నస్పూర్

సివిల్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్న తన కుమారుడు శివకాంత్(ఫ్లంబర్)ను డ్యూటీకి అనుమతించకుండా సూపర్‌వైజర్ గంగారాం వేధింపులకు గురి చేస్తున్నాడని తల్లి గోపు సమ్మక్క ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంట్రాక్టు కార్మికులతో కలిసి మాట్లాడారు. అనారోగ్యం కారణంగా తన కుమారుడు నెల రోజులు విధులకు హాజరు కాలేకపోయాడని, తర్వాత విధులకు హాజరవుతుండగా సూపర్వైజర్ గంగారాం అనుమతించకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపారు. గురువారం విధులకు అనుమతించనని సూపర్‌వైజర్ చెప్పడంతో చనిపోతానంటూ వెళ్లాడని విలపించారు. శివకాంత్ మానసిక క్షోభకు గురవుతున్నాడని, కుమారునికి ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత గంగాగాం వహించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికులను వేధిస్తున్న సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పథకాలు నిరంతర ప్రక్రియ

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఇచ్చోడ

రాజ్యాంగం అమలు శుభ దినం సందర్భంగా ఈనెల 26 నుంచి ప్రభుత్వం నాలుగు పథకాలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామ సభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ జాబితాలో పేరు రానివారు బాధపడొద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, భూమిలేని కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు అందుతాయన్నారు. రైతు భరోసా సహాయాన్ని రూ.12 వేలకు పెంచడం జరిగిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందుతుందన్నారు. రేషన్ కార్డు లేని పేదలను గుర్తించి అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మీసేవ ద్వారా రేషన్ కార్డులలో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చడానికి వచ్చిన దరఖాస్తులు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వాటిని స్వీకరించి పరిశీలన చేస్తామన్నారు. గ్రామసభల్లో ఇల్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్ర పరిశీలనలో ఇంటి స్థితిగతును తెలుసుకోవడం, ఇండ్లు కట్టుకోవడానికి కావలసిన స్థలాన్ని పరిశీలించి ఫోటోలు కూడా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణ్, తహసీల్దార్ సత్యనారాయణ రావు, స్థానిక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

తాండూర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి "పరాక్రమ దివాస్" సందర్భంగా గురువారం బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టి వెంకటకృష్ణ, విశిష్ట అతిథులు తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. 101 రక్తదాతలు 101 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభినవ సంతోష్ కుమార్ తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జనవరి 24, 2025 | www.navatelangana.com

ఖేలో భారత్ క్రీడోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో భారత్ క్రీడోత్సవాలను మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి క్రీడలు విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా వారిలో శారీరక ధృఢత్వాన్ని ఏర్పరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని గుత్పాల గ్రామంలో మిని గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు గురువారం పలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ రవీందర్ మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా చేసుకున్న తర్వాతే భోజనం చేయాలని అన్నారు. అంతేకాకుండా ఆహారం తీసుకునేటప్పుడు ఈగలు, దోమలు, తిను బండారాలపై వాలకుండా చూసుకోవాలని అన్నారు. అంతేకాకుండా చిన్నపాటి జ్వరం వచ్చినా కూడా వెంటనే డాక్టర్‌నీ సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్ఎం కల్పన, ఆస్పత్రి సిబ్బంది భారతి, అనురాధ, వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలించి తీసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

దరఖాస్తులను పరిశీలించి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండలంలోని జాతర్ల గ్రామంలో కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామ సభల్లో కలెక్టర్ మాట్లాడారు. గ్రామసభల్లో 5 గ్యారంటీ పథకాల కోసమే కాకుండా ఇంకా వేరే సమస్యల గురించి ఏమైనా దరఖాస్తులు వస్తున్నాయా అని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారులు, గ్రామసభ బృందాలు గ్రామసభలను ఓపికగా నిర్వహించాలని, ప్రజలకు ఆయా పథకాలపై ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయాలని బాధ్యతగా పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభల్లో ఎక్కువగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని రాజురా గ్రామంలో అధికారులు గురువారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభ రసాభాసగా మారింది. ఈ సందర్భంగా గ్రామసభలో గతంలో సంక్షేమ పథకాలకు ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల లిస్ట్‌ను అధికారులు గ్రామస్తులకు చదివి వినిపించారు. దీంతో గ్రామస్తులు తమ పేర్లు రాలేదని అనర్హుల పేర్లు వచ్చాయని, భూస్వాములకే, ధనవంతులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారి పేర్లు వస్తున్నాయని అధికారులను ప్రశ్నించడంతో గందరగోళం నెలకొన్నది. దీంతో అధికారులు అర్హులు ఎవరైనా ఉంటే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా పలువురు గ్రామ నాయకులు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు గ్రామస్తులకు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభ సమావేశంలో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హుల పేర్లు రాకుండా అనర్హుల పేర్లే ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. అనర్హుల పేర్లు తొలగించి, అర్హుల పేర్లు చేర్చాలని డిమాండ్ చేశారు. వీరికి తోడుగా బీజేపీ మండలాధ్యక్షులు సాబ్లే సంతోష్ సింగ్, యువ నాయకులు రాథోడ్ రాజశేఖర్, షేక్ బాబాల్, బాక్రే శేఖర్, ప్రజలు, వారికి యువకులు మద్దతుగా అధికారులతో మాట్లాడారు. గ్రామస్తులు మాట్లాడిన దానికి బదులుగా ఎంపీడీఓ రాజ్‌వీర్ లిస్ట్ తయారు చేసినంత మాత్రాన నిర్ణయించినట్టు కాదని వారు ఎటువంటి దిగులు చెందొద్దని, గ్రామ సభలలో చదివి వినిపించిన తర్వాత గ్రామస్తులు అందరూ సరే అంటేనే నమోదు చేసిన లిస్టును పైఅధికారులకు పంపుతామని లేదంటే ఎవరెవరి పేర్లు లేవు వారు దరఖాస్తు చేసుకోవాలని ఒకవేళ ఉన్నవారి పేరు వచ్చినట్టయితే ఈ నిర్ణయించిన లిస్టు కాకుండా మళ్లీ సర్వే నిర్వహించి నిర్ణయించడం జరుగుతుందని ఎవరు అపోహ పడవద్దని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు, గ్రామస్తులు వెనక్కి తగ్గకుండా ఇండ్లు లేని నిరుపేదలకు ఇస్తే పరవాలేదు. కానీ ఇందులో వచ్చిన పేర్లన్నీ ఉన్నవారికి వచ్చాయని ఇలా మరోసారి చేయడం సరికాదని అన్నారు. అంతేకాకుండా సర్వే నిర్వహించి, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రవీందర్, ఏఓ కృష్ణవేణి, ఏపీఓ వసంత్, ఏఈఓ సౌజన్య టీఏ వినోద్, ఎఫ్ఏ లత గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను అందించే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మావల మండలంలోని బట్టిసవర్గాం గ్రామపంచాయతీ గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజాసంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికీ చేరాలన్న సదుద్దేశంతో చేపడుతున్న గ్రామసభలను ప్రతిపక్షాలు కావాలనే రాజకీయాలకు వాడుకుంటున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి రాజలింగు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ శంకర్, ఆర్ఐ అమృత్, ఏఓ వివేక్, ఎంపీఓ శోభన, ఏపీఓ రజిని, పంచాయతీ కార్యదర్శి హేమలత, హౌసింగ్ డీఎం బసవేశ్వర్, డిప్యూటీ హౌసింగ్ శంకర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, గోవర్ధన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న వార్డు సభలు నిర్మల్ పట్టణంలో కొనసాగుతున్నాయి. స్థానిక గుల్జార్ మార్కెట్, ఇస్లాంపుర, బేస్తావారిపేట్ కాలనీలో గురువారం వార్డు సభలు నిర్వహించారు. ఈనెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని తెలిపారు.



బాలికలు ఎదగాలి..చదవాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాధిక



నవతెలంగాణ-సారంగాపూర్

బాలికలు ఎదగాలి చదవాలని నిర్మల్ సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. గురువారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని స్వర్ణ ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి అవగాహన కల్పించారు. బాలికలు ఆరోగ్యం, పోషకాహారంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాలికలకు సమాన అవకాశాలతో పాటు వారి హక్కులకు భంగం కలగకుండా రక్షణ అందిరి బాధ్యత అన్నారు. ముందుగా పాఠశాల అంతా కలియతిరిగి, తరగతి గదులు, స్టాక్ రూమ్, వంటగది, భోజనశాలను పరిశీలించారు. బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం న్యాయమూర్తిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంగీత రాణి, వార్డెన్ రాథోడ్ మంగిలాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని తిప్ప గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో ఆదిలాబాద్‌కు చెందిన న్యూరెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అక్షరాస్యత, పొదుపు, స్వయం ఉపాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కొమ్ము రాము మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గిరిజన మహిళలు, ఆర్థిక అక్షరాస్యత, స్వయం ఉపాధిపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని అన్నారు. గ్రామంలోని స్వయం సహాయక గ్రూపు మహిళలకు మక్కువ ఉంటే తమ పరిసరాల్లో సహజ సిద్ధంగా దొరికే, అడవిలో ఉన్నటువంటి వనరుతో వెదురు బొంగులతో బుట్టల తయారీ, ప్రొరాకుల తయారి, ఇప్ప పువ్వుతో ఇప్ప లడ్డుల తయారిపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘం మహిళలు, గ్రామపెద్దలు, యువకులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు గ్రామ ప్రజల పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగంలో అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తి అవుతుందని, రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా తాము కృషి చేస్తున్నామని సమత సైనిక్ దళ్ రాజ్య సంఘటక్ డాక్టర్ మహేందర్ జాదవ్ అన్నారు. గురువారం అశోక బుద్ధ విహార్‌లో పది రోజులు శ్రామ్నేర్ శిబిరంలో ఆయన పాల్గొని కెడెట్లకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జనవరి 26న జరిగే మార్చ్ ఫాస్ట్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా సమత సైనిక్ దళ్ రాజ్య సంఘటక్ మహేందర్ జాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా పది రోజుల పాటు శ్రామ్నేర్, సైనిక్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో రాజ్యాంగంపై అవగాహన కల్పిచడం జరుగుతుందన్నారు. రాజ్యంగం అమలు చేసి 75 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా జనవరి 26న జిల్లా కేంద్రంలోని అశోక్ బుద్ధ విహార్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు మార్చ్‌ఫస్ట్ ఉంటుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘటక్ రామకాంత్ కాంబ్లె, దక్షిణ భారత్ సంఘటక్ దీపక్ వాఘ్మారే, రవిచంద్రజాబడే, విష్ణుభూషన్ వాఘ్మారే, సత్యపాల్ వాఘ్మరే, అశ్వీని కలంకర్, తక్షేశీల కదం పాల్గొన్నారు.

జాతీయ జెండా వద్ద భారత రాజ్యాంగం పెట్టాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

భారతదేశ సమస్తాన్ని అది శాసన రూపంలో నడిపించే సుప్రీం పవర్ భారత రాజ్యాంగం గ్రంథాన్ని, డాక్టర్ అంబేద్కర్ చిత్రాన్ని జాతీయ జెండా వద్ద పెట్టాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ అన్నారు. లక్ష పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని పోస్టు ఆఫీస్ కార్యాలయం ఎదుట ఉన్నా పోస్ట్ బాక్స్‌లో వందలాది పోస్ట్ కార్డులను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవం, భారత రాజ్యాంగ అమలు దినం, రిపబ్లిక్ డే, జనవరి 26న జాతీయ జెండా వద్ద భారత రాజ్యాంగ గ్రంథాన్ని దాని రూప శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలు అక్కడ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ సంస్థలన్నింటిని, ప్రభుత్వేతర సంస్థలకు కూడా అదేశించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి డిమాండ్ లేఖని తెలంగాణలోని లక్ష మంది పౌరులం రాస్తున్నామని అన్నారు. త్వరగా నిర్ణయం తీసుకుంటారానీ, అ అద్భుత దృశ్యాన్ని తెలంగాణ ప్రజలందరికీ చూపిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల నాయకులు పోనకంటి ఆశన్న, ప్రవీణ్, నరేశ్ పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు అమలు

- ఎంపీడీఓ కాంతారావు



నవతెలంగాణ-సారంగాపూర్

అర్హులకే పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ కాంతారావు, ప్రత్యేకాధికారి అజీజ్ ఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వం అమలు చేయూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా పథకాలు లబ్దిదారుల జాబితాను చదివి వినిపించారు. లబ్దిదారుల జాబితాలో పేరు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు మీరు చదివిన జాబితాలో ఇండ్లు లేనివారి పేర్లు లేవని అధికారులను నిలదీశారు. మరోసారి సర్వే చేసి అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పంచిన అధికారులు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మారెడ్డి, ఏఈఓ అరుణ్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ షేకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ 128వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వీరుడని, అజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి, తెల్ల దొరల గుండెల్లో నిద్రించిన ధీరుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన అశోక్, నారాయణ, దినేష్, గంగాధర్, సాయన్న, సాగర్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ అనంతపేట్‌లో...

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలను నిర్వహించారు. కళాకారుడు పోలీస్ భీమేశ్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో నేతాజీ చేసిన కృషి, త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడిగె కిషన్, బెజ్జెంకి రాజేశ్వర్, సీహెచ్ రమణ, సంగెం పెరుమాళ్లు, జి.చింటు, కె.వినోద్, డి.గంగాధర్, ఎస్ భీమేశ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ 4వ మహాసభల ప్రచార కార్యక్రమాలు నిర్మల్ పట్టణంలో పోస్టర్లతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డి.పోశెట్టి, తొడసం శంబులు మాట్లాడారు. ఈ మహాసభలలో గత మూడేండ్లలో ప్రజల సమస్యలపై సీపీఐ(ఎం) చేసిన పోరాటాలను సమీక్షించి, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ మహాసభల్లో రైతులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు, యువజనులు, సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కార మార్గాలను ప్రజల ముందుకు తీసుకురావడం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమై ప్రజాస్వామ్య హక్కులపై నిర్బంధాలు కొనసాగిస్తే, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన పరిస్థితి కాంగ్రెస్‌కు కూడా ఎదురవుతుందని వారు హెచ్చరించారు.



ఒత్తిడిని అధిగమించేందుకు వైద్య పరీక్షలు

- ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ఉద్యోగుల విధులు ఒత్తిడితో కూడుకున్నావని దాన్ని అధిగమించేలా ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తార్నాక హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ అన్నారు. గురువారం ఆర్టీసీ డిస్పెన్సరీలో ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్‌తో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తార్నాక ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ శైలజ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన ఉద్యోగం ఆర్టీసీదన్నారు. అనేక రకాల వ్యాధులు వచ్చిన విధులు నిర్వహణలో వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ఎండీ సజ్జనర్ గతంలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తే అనేక మంది వివిధ వ్యాధులో బాధపడుతున్నట్టు తెలిసిందన్నారు. కొందరికి స్టంట్, సర్జరీ కూడా చేశామని తెలిపారు. అంతే కాకుండా సీడీఈ క్యాటగిరిని ఏర్పాటు చేసి అందులో ఉన్న వారికి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామన్నారు. దీని కోసం డిపోల వారిగా ఇద్దరు హెల్త్ వాలంటీర్లను కూడా నియమించామన్నారు. ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. అందుకే వారి కోసం వైద్య శిభిరం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి ఆర్ఎం ప్రవీణ్, ప్రణయ్, డిపో మేనేజర్ కల్పన, డిస్పెన్సరీ వైద్యులు కీర్తి, వెల్ఫేర్ బోర్డు సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
3
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | జనవరి 24, 2025 | www.navatelangana.com

ఆన్‌లైన్ కేంద్రాలకు బారులు

నవతెలంగాణ-కెరమెరి



సంక్షేమ పథకాల అమలు కోసం సర్వేలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులుగా అధికారుల సమక్షంలో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా తదితర పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్హుల జాబితాలో పేర్లు లేని లబ్ధిదారులు మళ్లీ ధరఖాస్తులు చేసుకునేందుకు అప్లికేషన్ పత్రాల కోసం ఆన్‌లైన్ కేంద్రాలకు బారులు తీరుతున్నారు. గతంలో దరఖాస్తున్న చేసుకున్న మళ్లీ దరఖాస్తు చేయడమేంటని మండల ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ తిరుగుతూ అమాయక ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

సొంత ఖర్చులతో పాఠశాలకు రంగులు

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని చిన్న సిద్దాపూర్ ప్రాథమిక పాఠశాలలో రాథోడ్ ఉదయ్ కిరణ్ తన సొంత ఖర్చులతో పాఠశాలకు స్వయంగా రంగులు వేశారు. ఈనెల 26 గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలను అందంగా ముస్తాబు చేయాలని ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో పాఠశాలకు రంగులు వేసినట్టు ఆయన తెలిపారు. గతంలో పాఠశాల గోడలు రంగులు లేక అంద విహీనగా కనబడగా రంగులు వేయడంతో పాఠశాలకు కళ వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపాధ్యాయుడు పాఠశాలపై శ్రద్ధ చూపడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయురాళ్లు సువర్ణ, మహేశ్వరి సహకారాన్ని అందించారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను సాధించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, ప్రాజెక్టు మేనేజర్ వెంకట్‌లతో కలిసి ఏపీఎం, సీసీలతో బ్యాంకు లింకేజీ లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాలను ఈ నెల 29 వరకు 100 శాతం సాధించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యం పూర్తి అయ్యేవరకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు జిల్లా కేంద్రంలోనే ఉండాలన్నారు. అనంతరం బ్యాంకు లింకేజీలు, రుణాల వసూలుపై మండలాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా ఉన్న వీధిలో పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఇండ్ల చుట్టూ నీరు చేరింది. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజి కారణంగా నీరు వృథాగా పారుతోంది. లీకేజి నీరు నిల్వ ఏర్పడి మడుగును తలపిస్తుంది. దీంతో రోడ్డు పక్కన గల చిరు వ్యాపారాలు చేసే వారు, కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తరుచు పైప్ లైన్ లీకేజీతో బురదగా మారుతుంది. దుర్గంధం సైతం వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సబంధిత మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్ లైన్ లీకేజీ సమస్యని పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని తొందర పాటుతనంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని సీఐ ముత్యం అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు కళాబృందం ద్వారా రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ రోడ్ సేఫ్టీ పాటించేలా చూడాల్సిన తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, శ్రీనివాస్, కాంత పాల్గొన్నారు.

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎంవీఐ రాజమల్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీటీఓ కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎంవీఐ మోహన్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలకు అన్ని రకాల పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తు సురక్షితంగా ఇండ్లకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ అరుణబాయి, సిబ్బంది వినీల్, వాజిద్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కెరమెరి



కెరమెరి : గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీలో జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ప్రజల దగ్గర నుండి సంక్షేమ పథకాలపై అభిప్రాయ సేకరణ సర్వేకు సంబంధించి మండలం కొఠారి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో డీపీఓ భిక్షపతితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభల్లో చదువుతున్న జాబితాలో పేర్లు లేని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోసారి ప్రజా పాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రైతు భరోసా కింద సాగు భూములకు మాత్రమే భరోసా మొత్తాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. రాళ్లగుట్టలు, వెంచర్లు, ప్లాట్లు లాంటి భూములను గుర్తించడం జరిగిందన్నారు. భూమిలేని నిరుపేదలు గ్రామీణ ఉపాధి హామీలో 20 రోజుల పైగా పని చేసిన కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరికి సంవత్సరానికి రూ.12000 చెల్లిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రతి ఇంటికి అధికారులు సర్వే చేశారని,దీని ప్రకారం అర్హులైన వారిని కానీ వారిని గుర్తించనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన వారి జాబితాను గ్రామసభలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి చదివి వినిపిస్తారని అభ్యంతరాలుంటే ప్రజలు తెలియజేయాలన్నారు. వాటిని సభలో నమోదు చేసి క్షేత్రస్థాయిలో మరోసారి వాటిపై సర్వే నిర్వహిస్తారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, పంచాయతీ కార్యదర్శి సతీష్ రావు, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని మాలనగొంది గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారి పోచయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రవేశపెడుతున్న నాలుగు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా జాబితాలో పేర్లు లేకుంటే ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, గ్రామ సభలోనే పరిష్కరించడం జరుగుతుందని, కానీ పక్షంలో ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడవి సీత, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : మాలనగొంది గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

మున్సిపాలిటీ పరిధిలో

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రైతు వేదిక బ్రాహ్మణవాడ, బజార్ వాడలో నిర్వహించిన వార్డు సభలలో మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి ఆర్డీఓ లోకేశ్వరరావు, కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

వాంకిడి : మండలంలోని ఇందానీ, బెండారా, వెలిగి, కన్నర్ గావ్ గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న నాలుగు పథకాలు ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండలాధికారులు తెలిపారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను కూడా స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, కార్యదర్శులు, ఆయా గ్రామ పంచాయతీల్లోని లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) సమరశీల పోరాటాలు



నవతెలంగాణ - తిర్యాణి

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) సమరశీల పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గేడం టికానంద్ అన్నారు. ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే పార్టీ రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో నాయకులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని, జిల్లాలో కూడా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో పోడు రైతుల పక్షాన పోరాడి భూములకు పట్టాలు ఇప్పించామని తెలిపారు. జిల్లాలో పులి పేరుతో తునికాకు సేకరణను ఆపకూడదని కలెక్టర్ ద్వారా రాష్ట్ర అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. దీంతో జిల్లాలో తునికాకు సేకరణ ప్రారంభమైందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తునికాకు కూలీలకు బోనస్ చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి బోనస్ ఇప్పించామని, కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుండి పెద్దవాగు వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో పోరాడి నిర్మాణ పనులు ప్రారంభించడానికి కృషి చేశామని వివరించారు. కాగజ్‌నగర్‌లో మాస్టర్ ప్లాన్ అమలుచేయాలని, గిరిజన గ్రామాకలు రోడ్లు మంజూరు చేయాలని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలను గత ప్రభుత్వాల కంటే వేగంగా అమలుచేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌తో పాటు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలులో నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రతి రైతుకు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సచిన్, భీంరావు, లెనిన్, కార్తీక్, రాజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.25 కోట్ల 4 లక్షల రుణ వితరణ చెక్కును మంచిర్యాల, ఆదిలాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్లు మురళీ మనోహర్ రావు, ప్రభుదాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి జిల్లా మహిళా సమాఖ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తూ రుణ సౌకర్యాన్ని కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలని తెలిపారు. 7 రోజులుగా సెర్ప్ సిబ్బంది, వీఏఓలు, సీసీలు, ఏపీఎంలు అహర్నిశలు కృషిచేసి బ్యాంకు లింకేజీ ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మహిళా సంఘాలు బ్యాంకులు అందించిన రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పిల్లలను చదివించి వారి ఉజ్వల భవిష్యత్తును మెరుగుపరచాలని కోరారు. తీసుకున్న రుణాలను తిరిగి క్రమం తప్పకుండా చెల్లించాలని, బ్యాంకులకు ఎలాంటి బాకీ లేకుండా చెల్లింపులు జరపాలని సూచించారు. సుమారుగా రూ.22 కోట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుణాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోర్తెటి శ్రీదేవి ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనడం మహిళా సంఘాలతో పాటు జిల్లాకు గర్వకారణమన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, ప్రతి గ్రూపు రూ.20 లక్షల రుణాన్ని తీసుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం రామకృష్ణ, డీఆర్పీలు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, సంబంధిత అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకల సందర్భంగా కొనసాగుతున్న పనులను ఎస్పీ డీవీ. శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఏఎస్పీ పి.ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో జరగనున్న వేడుకలను అధికారులు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించాలన్నారు. వేడుకలలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతి వివరాలతో స్టాల్స్, వైద్య శిబిరం, ప్రముఖులు, ప్రెస్, వేడుకల కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చే ప్రజలకు కుర్చీలు, టెంట్లు, తాగునీటి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని విద్యార్థులకు తాగునీరు, అల్పాహారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకల నిర్వహణలో భాగంగా ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధుల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభ నిర్వహణన..? పంచాయతీ భవన స్థల పరిశీలనన..?



నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కోసం గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. గురువారం మండలంలోని బోధన్ పల్లి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి అక్కడ ఎవరు లేకుండా అసలు విషయాన్ని వదిలేసి గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం స్థల పరిశీలనకు అధికారులు అక్కడి కార్యదర్శి రమేష్‌తో కలిసి వెళ్లారు. గ్రామసభ ఏర్పాటు చేసిన చోటు ఎవరు లేకపోవడంతో సభ నిర్మానుషాయంగా దర్శనమిచ్చింది. దీంతో గ్రామ సభ నిర్వహణన, పంచాయతీ భవన స్థల పరిశీలనన అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రమేస్‌ను అడగగా పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించడానికి వెళ్లినట్లు తెలిపారు. దీనిపై గ్రామస్తులు వచ్చిన పని వదిలిపెట్టి మరో పని కోసం పరిశీలనల పేరట వెళితే సమస్యల పరిష్కారం ఎలా అవుతుందని అధికారులను నిలదీశారు.

నాటు సారాయి స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని లంబడిహెట్టి, రణవెల్లి గ్రామాల్లోని నాటుసారాయి స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపిన వివరాల ప్రకారం 60 లీటర్ల నాటుసారాయి, నాటుసారాయి తయారీలో వాడే 30 కిలోల బెల్లం, 10 కిలోల పటికని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసులు నమోదు చేసి 4000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం నాటు సారాయి, గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలపై గ్రామాలలో అవగాహన కల్పించారు. ఎనిమిది మంది నేరస్తులని మండల తహసీల్దార్ మునావర్ షరీఫ్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పి.లోభానంద్, ఐ.సురేష్, పి.రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన టీఎమ్మార్పీస్ నాయకులు



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని టీఎమ్మార్పిస్ నాయకులు సందర్శించారు. విధులు నిర్వహిస్తున్న వైద్యుడు కేశవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైద్యునితో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెల్సుకున్నారు. కార్యక్రమంలో టీఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు గోగర్ల అశోక్, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆజాద్ హిందూ ఫౌజ్ వ్యవస్థాపకులు, ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ విద్యార్థులు దేశ అభివృద్ధిలో తమ పాత్ర మరువకూడదని, సుభాష్ చంద్రబోస్ ఏ విధంగా అయితే దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేశారో అలాంటి లక్షణాలు కలిగి ఉండి దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, వెంకటేశం, మహేష్, సతీష్, సంతోష్, సానియా, శాంభవి, రజిత, టెమాజీ, నర్సింగ్ రావు, మల్లికార్జున్, అపూర్వ, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పెంటయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ మండల అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు మాజీ వైస్ ఎంపీపీ మంగ భర్త సుంకరి పెంటయ్యను నియమించారు. జిల్లా ఎన్నికల అధికారి ధోని శ్రీశైలం జారీ చేసిన నియామక పత్రాలను మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆయనకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, నాయకులు సురేష్, వెంకటేష్, కోట వెంకన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | జనవరి 24, 2025 | www.navatelangana.com

గైర్హాజరు సింగరేణి ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట 1 ఇంక్లైన్ గనిలో గైర్హాజరు ఉద్యోగులకు గని మేనేజర్ భూశంకరయ్య ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ ఉద్యోగులు 16 కన్న తక్కువ మాస్టర్లు, సర్ఫేస్ ఉద్యోగులు 20 మాస్టర్లు కన్న తక్కువ డ్యూటీలు చేసిన ఉద్యోగులకు మొదటి షిఫ్ట్ వారికి గని మేనేజర్ కార్యాలయంలో, మధ్యాహ్నం షిఫ్ట్ ఉద్యోగులకు క్యాంటీన్ హాల్లో గైర్హాజరు కౌన్సెలింగ్ ఇచ్చారు. గైర్హాజరు వల్ల కంపెనీకి, ఉద్యోగుల కుటుంబాలకు జరిగే నష్టాన్ని ఉద్యోగులకు గని మేనేజర్ భూశంకరయ్య వివరించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ జీషాన్, సేఫ్టీ ఆఫీసర్ నిఖిల్ అయ్యర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, గని పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలోని విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో జిల్లా రవాణాశాఖ అధికారి సంతోష్ కుమార్‌తో కలిసి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, డైట్ చార్జీలు పెంచి నూతన మెనూ అమలు చేస్తూ పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తుందన్నారు. జిల్లా రవాణా అధికారి విద్యార్థులకు వేడినీటి కోసం 2 గీజర్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి, ఏబీసీడబ్ల్యూఓ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్పీ3 గని ఐఎన్టీయూసీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

ఎస్‌ఆర్పీ1, ఎస్‌ఆర్పీ3 గని ఐఎన్టీయూసీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఎస్‌ఆర్పీ 3 ఏరియా కార్యదర్శిగా దుండె వీరమల్లు, ఎస్‌ఆర్పీ3 ఫిట్ కార్యదర్శి రిక్కల గోపాల్ రెడ్డి, ఫిట్ సహాయ కార్యదర్శిగా సల్లంగి శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీరికి జెట్టి శంకర్‌రావు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం కమిటీని ఎస్‌ఆర్పీ ఏరియా ఏజెంట్, ఎస్‌ఆర్పీ3 గని మేనేజర్లకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి ఐక్యంగా పనిచేస్తూ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యామ్, జిల్లా కార్యదర్శి భీంరవి, మైనింగ్ స్టాఫ్ సెంట్రల్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, మైనింగ్ స్టాఫ్ ప్రధాన కార్యదర్శి మారెపెల్లి బాబు, ఫిట్ కమిటీ నాయకులు లక్షెట్టి రాజయ్య, పూర్ణ చందర్, సాంబయ్య రాజేశం, బండ లక్ష్మణ్, పులుగం వెంకటేష్, దొనుగు మల్లేష్ పాల్గొన్నారు.

కవ్వాల్ అడవులను సందర్శించిన ఫారెస్ట్రీ విద్యార్థులు



నవతెలంగాణ-జన్నారం

అడవుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని జన్నారం ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ సుష్మారావు అన్నారు. గురువారం డీఎస్సీ ఫారెస్ట్రీ సెకండియర్ హైదరాబాద్ అకాడమీ విద్యార్థులు కవ్వాల్ టైగర్ జోన్ అడవిని సందర్శించారు. శిక్షణలో భాగంగా రావడంతో వారికి అడవుల గురించి తెలియజేయడంతో పాటు అవగాహన కల్పించారు. జంతు, అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం గురించి తెలియజేశారు. ఇందులో డీఆర్డీ తిరుపతి, అటవీ అధికారులు, శిక్షణ విద్యార్థులున్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



నవతెలంగాణ-నస్పూర్

ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆర్కే6 గనిలో ట్రాఫిక్ నియమలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు. మీ రక్షణ మీ ఇంటి వద్ద నుండే మొదలు కావాలని సూచించారు. గని మేనేజర్ ఇ.తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగులందరు రక్షణ పరికరాలను వాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్క ఉద్యోగి పాటించాలన్నారు. కార్యక్రమములో సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, అడిషినల్ మేనెజర్ మర్రి కోమురయ్య, సర్వే ఆఫీసర్ ఎస్‌పీ.వర్మ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కెఎస్. సురేందర్, గుర్తింపు సంఘం నాయకులు సంఘం సదానందం, ముష్కె సమ్మయ్య, గోరె నర్సయ్య, కారుకూరి నగేష్ పాల్గొన్నారు.

గ్రామ సభలలో గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గ్రామ సభలలో గల్ఫ్ కార్మికులకు న్యాయం చేయాలని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలెడ భూమన్న అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు వంటి పథకాలకు సంబంధించి గ్రామ సభల్లో ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు లేకుండా అన్ని అర్హతలున్న గల్ఫ్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వలస వెళ్లిన గల్ఫ్ కార్మికులకు నష్టం కలిగించొద్దని కోరారు. వలస కారణంగా గ్రామాలలో వారి పేర్లు ప్రభుత్వ డేటాలో లేకుండా పోవడంతో ఇల్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కోల్పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాల్లో అవకాశం కలిపిచాలన్నారు. గల్ఫ్ కార్మికులకు ఈ పథకాలలో ప్రత్యేక మినహాయింపు కల్పించాలని, వారి వలస జీవితం కారణంగా వారికి వచ్చే నష్టాలను పూడ్చడానికి ప్రత్యేకమైన ఆడిట్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలలో గల్ఫ్ కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మైనారిటీ గురుకులలో ప్రవేశలకు దరఖాస్తులు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మందపెల్లి సంధ్య గురువారం ప్రకటన తెలిపారు. 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 60 సీట్లు, ఇతరులకు 20 సీట్లతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో మైనార్టీలకు 30 సీట్లు, ఇతరులకు 10 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జనవరి 18 నుండి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలన్నారు. వివరాలకు 7331170841, 9908959181 నంబర్‌లలో సంప్రదించాలని, లేదా మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీనగర్ రోడ్ నంబర్-8లోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలకు నేరుగా వచ్చి సంప్రదించాలని కోరారు.

పారదర్శకంగా లబ్దిదారుల జాబితా

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మందమర్రి



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి పారదర్శకంగా లబ్దిదారుల జాబితా రూపొందిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో క్యాతనపల్లి మున్సిపల్ కమీషనర్ రాజు, మందమర్రి మండల తహసీల్దార్ సతీష్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు జాబితా రూపొందిస్తున్నామన్నారు. జాబితాలో వివరాలు రాని వారు మరలా దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో మీసేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులు, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల గణన కార్యక్రమంలో సేకరించిన సమాచారం, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాలు, వార్డు సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించి, అర్హత మేరకు అర్హులైన లబ్దిదారులకు పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24 వరకు గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితాను చదివి వినిపించినంతరం జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, గ్రామ సభ నిర్వహించే ముందు ప్రజలకు సమాచారం అందిస్తామన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి మండలం అకెనపెల్లి, పాత బెల్లంపల్లి గ్రామపంచాయతీలలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు లబ్దిదారుల ఎంపిక గురించి ప్రజల మనోగతాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకాలకు అర్హత కలిగి జాబితాలో పేరు లేకుంటే సంబంధిత అధికారులకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి ఎంపిక జాబితాలో పేరు చేర్చడం జరుగుతుందన్నారు. సాగు భూములకే రైతు భరోసా అందిస్తున్నామని సాగులో లేని భూములకు రైతు భరోసా వర్తించదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, ఆర్డీఓ హరికృష్ణ, తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీఓ ఆర్.మహేందర్, ఎంపీఓ వేదాల శ్రీనివాస్, ఆర్ఐ మురళీధర్ రావు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి



నవతెలంగాణ-జన్నారం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం జన్నారంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు మాట్లాడుతూ 1897లో ఒడిశాలోని కటక్‌లో జన్మించిన బోస్ ఇండియన్ సివిల్ సర్వీసెస్ పక్కన పెట్టి స్వాతంత్రోద్యమంలో భాగస్వాములయ్యారన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. 1945లో బోస్ ఎటొ చెందినట్లు భావిస్తున్న, దాన్ని ప్రభుత్వం ఇప్పటి వరకు నిరూపించలేదన్నారు. కార్యక్రమంలో పొనకల్ గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ బాలసాని శ్రీనివాస్ గౌడ్, యువజన సంఘం నాయకుడు మనీష్, సత్యనారాయణ గౌడ్, కొండపల్లి మహేష్, మురళి, శ్రీధర్ పాల్గొన్నారు.

స్నేహ యూత్ ఆధ్వర్యంలో

స్నేహ యూత్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకే ప్రోగ్రాం అసిస్టెంట్ సురేష్ మాట్లాడుతూ సామాజిక సేవలో ముందున్న యువజన సంఘాలకు నెహ్రూ యువ కేంద్రం సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్నేహ యూత్ అధ్యక్షులు దుమల్ల రమేష్, జిల్లా నాయకులు గన్నేరువరం రాజేశేఖర్, సభ్యులు ప్రవీణ్, కళాశాల అధ్యాపకులు బాపు దేవందేర్, కరుణకార్ పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు

నవతెలంగాణ-కాసిపేట



సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాటకు కట్టుబడి లేకుండా ఉద్యోగాలు భర్తీ చేసి మాదిలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. గురువారం మండలంలోని సోమగూడెం(కే) గారమంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ తండ్రి కల్వల లక్ష్మయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత దాని అమలు కోసం మరో పోరాటం చేయాల్సిన అవసరం లేదన్నారు. కానీ స్వార్థపరులు కల్పిస్తున్న అడ్డంకుల వల్ల రోడ్డెకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై మాలల ఒత్తిడి ఉన్న మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ అమలులో తీసుకురావడానికి చిత్తశుద్ధితో ముందుకు నడుస్తారని ఆశిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వేల గొంతులు లక్షల డప్పులు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని, వచ్చే ప్రతి ఒక్కరు వెంట డప్పు తెచ్చుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సాంస్కృతిక పరికరాలు ఉన్న అత్యంత ఆధునిక సాంస్కృతిక చిహ్నం మాత్రం కేవలం డప్పు మాత్రమేనని అన్నారు. డప్పుకు గౌరవం పెంచడం కోసం జాతికి గెలుపును అందించడం కోసం లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీష్, జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, జీలకర శంకర్, దాసరి రామచందర్, రామగిరి మహేష్ పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



నవతెలంగాణ-మందమర్రి

పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సింగరేణి పాఠశాలల సెక్రటరీ జి.శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. గురువారం కళ్యాణిఖని సింగరేణి ఉన్నత పాఠశాలని సందర్శించి తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం, భోజన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు గ్రేడ్ పాయింట్స్ అధికంగా సాధించాలన్నారు. పాఠశాలలోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని పిల్లలకు వడ్డించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న కమలా, వంట సిబ్బంది సేవలను కొనియాడుతూ శాలువాతో సన్మానించారు. ఇటీవల జరిగిన సీఎం కప్, సైన్స్ ఒలంపియాడ్, ఇతర క్రీడలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రశంసించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శ్యాంసుందర్, హెచ్‌ఎం జె.పురుషోత్తం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

27న ఉద్యోగుల భవిష్య నిధిపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో జనవరి 27న జిల్లా అవగాహన శిబిరం, అవుట్‌రిచ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల 27న ఈ శిబిరం ఉంటుందని, ఒకవేళ సెలవు ఉంటే తదుపరి పని దినంలో నిర్వహిస్తామన్నారు. నిర్మల్ జిల్లా కార్యాలయం పరిధిలోకి వచ్చే మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలో కార్యక్రమం ఉంటుందన్నారు. మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలం దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ కంపెనీ సమావేశ మందిరంలో ఈ నెల 27న ఉదయం 9 నుండి సాయంత్రం 5.45 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఇందులో సభ్యుల ఫిర్యాదుల పరిష్కారం వేదికగా, సమాచార మార్పిడి నెట్‌వర్క్ పని చేస్తుందని, సభ్యులు తమ ఫిర్యాదులను జిల్లా కార్యాలయ ఈ-మెయిల్ పంపించవచ్చని తెలిపారు.

అర్థమయ్యే విధంగా బోధనలు చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

తరగతి గదిలో విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని ఎంఈఓ ముక్తవరం వెంకటేశ్వర స్వామి పేర్కొన్నారు. గురువారం కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విషయానుగుణంగా బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి వారిని ఆయా తరగతులలో చేర్చుకొని విలేజ్ ఎడ్యూకేషన్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు సవరించాలని సూచించారు. ప్రతినెల నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి, విద్యార్థుల హాజరుపై చర్చించాలని ఆదేశించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం మామిడిపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన అపార్ ఐడీలు జనరేట్ చేయాలని, విద్యార్థులకు సంబంధించిన అన్ని పరీక్షల మార్కులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి బి.లస్మయ్య, ఆర్పీలు కిరణ్ కుమార్, శారదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన సుద్దాల రాములు, జిల్లపల్లి శ్రీనివాస్, మరుసుకోల చందు, జుల లక్ష్మయ్య వివిధ కారణాలతో మృతి చెందారు. బాదిత కుటుంబాలకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ అండగా నిలిచారు. వారిది బీద కుటుంబం కావడంతో కాంగ్రెస్ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా కుటుంబాలకు రూ.5000 చొప్పున ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకుడు గడ్డం త్రిమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. బాదితులకు అండగా ట్రస్టు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొట్ల మహేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి రమేష్, నాయకులు భానుచందర్, రాజన్న, రాజు, రవి, శేఖర్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఏకగ్రీవం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో గురువారం కాసిపేట మండల మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడి ఎన్నికల్లో భాగంగా నామినేషన్ కార్యక్రమం చేపట్టారు. అట్టిపల్లి శ్రీనివాస్ పటేల్ తన నామినేషన్ వేశారు. ఇతరులు ఎవరు నామినేషన్ వేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవాన్ని జనవరి 26న ఉదయం 11 గంటలకు దేవాపూర్ సల్వాలవాగు రామాలయం సమీపంలో ఉంటుందని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని, మండలంలోని మున్నూరు కాపులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఇంగు నారాయణ, సిద్ధం తిరుపతి, భారతాని సతీష్, చింతల భీమయ్య, సూరం కిషన్, మున్నూరుకాపు సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి సోమగూడెం కొత్త కాలనీకి చెందిన ఇలా సాగరం ఆశాలు(55) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... ఇలాసాగరం ఆశాలు షుగర్, తిమ్మిర్లు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితం మీద విరక్తి చెందాడు. గురువారం తన ఇంట్లోనే చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడి కుమారుడు ఇలాసాగరం ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రేపు మినీ జాబ్‌మేళా

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 25న 10.30కు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం సంస్థలో మంచిర్యాల పరిసర ప్రాంతాలలో పని చేసేందుకు 50 ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, ఇందుకు గాను 18-35 సం.ల వయస్సు, ఎస్ఎస్సీ, ఇంటర్ విద్యార్హత కలిగి ఉండి, స్మార్ట్ ఫోన్, బైక్ కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 7013188805, 9110368501 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నవతెలంగాణ

ఆదిలాబాద్

5

శుక్రవారం | జనవరి 24, 2025 | www.navatelangana.com

రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ట్రిబుల్, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు, ఆర్టీసీ కంట్రోలర్లు రాజేందర్, రాజన్న పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

నవ తెలంగాణ-నేరడిగొండ





మండలంలోని బోథ్ ఎక్స్ రోడ్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా వైపు నుండి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లాల్‌షావ్, నితిన్ మడావి తీవ్ర గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

- జిల్లా జడ్జి ఎంవీ.రమేశ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎంవీ.రమేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో రెండు రోజుల న్యాయ విజ్ఞాన సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి యువరాజు, జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్‌తో కలిసి హాజరై ఖైదీలకు అవగాహన కల్పించారు. అంతకుముందు జైలు ఆవరణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో ప్రశాంతమైన జీవనం గడపాలన్నారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ సత్ప్రవర్తనతో దైవం పట్ల భక్తి భావం కలిగి ఉండాలని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సారిక, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ నరహరి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ వెంకటేశ్వర్, పారా లీగల్ వాలంటరీ జయరాజ్, జైలు అధికారులు పాల్గొన్నారు.

ఓటరు అవగాహనతో పాటు పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంలో భాగంగా వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని ఎన్నికల నోడల్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. గురువారం డైట్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు ఓటరు నమోదు, ఓటుపై అవగాహన కల్పించేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీరి ద్వారా ప్రతి ఒక్కరికి ఓటుతో పాటు ఎన్నికల గురించి తెలియజేయడం ముఖ్య ఉద్యేశమన్నారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి జాతీయ ఓటరు దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హిందీ హైస్కూల్ హెచ్‌ఎం లచ్చిరాం, డైట్ వైస్ ప్రిన్సిపల్ కిరణ కుమార్, ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, ప్రతాప్, నీలాదేవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి

నవతెలంగాణ-సిరికొండ

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని సంతు నారాయణ మహరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయ పరిసరాల్లో సనాతన ధర్మ సేవా సమ్మేళన మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ, భక్తి భావంతో మెలగాలని అన్నారు. పర్యావరణాన్ని రక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ వక్త శివకుమార్, సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, ఆయా మండలాల సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్‌శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర నాయకులు సదానందం అన్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపి మద్దతుగా కూర్చున్నారు. విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేసి 2016లో అప్పటి సీఎం కేసీఆర్ కమిటీ వేశారని, కమిటీ నివేధిక ఇచ్చిందని, జేఏసీ రాష్ట్ర నాయకులు సదానందం అన్నారు. 2017లో కమిటీ రిపోర్టు ప్రకారం రెగ్యులర్ చేస్తు ఉత్తర్వులు కూడా వచ్చాయన్నారు. కొందరు నిరుద్యోగులు కోర్టుకు వెళ్లడంతో దాన్ని నిలిపివేశారన్నారు. కోర్టు కేసు కూడా డిస్‌పోజ్ అయిందని, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ 1947 ప్రకారం తమను రెగ్యులర్ చేయొచ్చని అన్నారు. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో ధర్నా సమయంలో అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని, కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాకా దాని ఊసెత్తడం లేదన్నారు. రెగ్యులర్ చేసే వరకు పోరాటలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ సంజు నాయక్, సత్యవన్, విలాస్, వెంకటేష్, నరేష్, గణేష్, దేవిదాస్ పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-లక్సెట్టిపేట

లక్సెట్టిపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్సై రామయ్య గురువారం సెల్‌ఫోన్లను అందించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించేందుకు సీఈఐఆర్ అనే యాప్‌ను ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిందన్నారు. రంగపేట గ్రామానికి చెందిన ఆవునూరి శ్రీనివాస్, దౌడేపల్లి గ్రామానికి చెందిన డ్రైవరు సమ్మిరెడ్డిలకు ఫోన్లను ఇచ్చారు.

నేడు వార్డు సభ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టణంలోని భాగ్యనగర్ వార్డు రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించే వార్డ్ సభను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్ అన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలను నిరంతరం పర్యవేక్షించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల సఖి కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి డీడబ్ల్యూఓ ఆడెపు భాస్కర్, యూనిసెఫ్ ప్రతినిధి రేశా దేశాయ్, సీహెచ్‌సీఈజీఐఎస్ సంస్థ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి కృషి చేస్తుందని, ఈ క్రమంలో అంగన్‌వాడీలను బలోపేతం చేస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, రక్తహీనత సమస్య ఉన్న బాలింతలకు సేవలు అందించాలని, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు వారి పరిధిలోని ప్రతి సెంటర్‌ను సందర్శించి అందిస్తున్న సేవలను పర్యవేక్షించాలని తెలిపారు. సామ్-మామ్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలామృతం ప్లస్, ఐఎఫ్ఏ సిరప్, విటమిన్ ఏ ప్రతి వారం అందించాలన్నారు. ఆస్పిరేషన్ జిల్లా అయినందున సంక్షేమ పథకాలలో వివిధ సంస్థల భాగస్వామ్యంతో మహిళలు, పిల్లల సంరక్షణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. యూనిసెఫ్ ప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి టీచర్లతో సమీక్షించాలని, కేంద్రాలను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. అధికారులు వారికి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, సీడీపీఓలు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, చాపిలే సాయి కృష్ణ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో మూడేండ్లలో ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలను సాధించిన విజయాలను చర్చించి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయాల్సిన పోరాటాలను రూపకల్పన చేస్తామన్నారు. 25న నిర్వహించే బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలకు పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, విజయ రాఘవ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రానున్నారన్నారు. కార్యక్రమంలో వస్తాకే సాయి, రాజేష్, మహేష్, గోవర్ధన్, జి.మహేష్, తిరుపతి, అంబాజీ పాల్గొన్నారు.

సమ్మెతో దిగొచ్చిన ప్రభుత్వం : ఏఐటీయూసీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కార్మికుల సమ్మెతో ప్రభుత్వం దిగివచ్చి హమాలీ రేట్లను పెంచిందని ఏఐటీయూసీ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సివిల్ సప్లాయి హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్లు ప్రతి రెండేళ్లకు ఒకసారి పెంచి, గత ప్రభుత్వాలు అమలు చేసిన హమాలీ రేట్లను ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయటానికి కాలయాపన చేయటంతో హమాలీ కార్మికులు చట్టబద్ధమైన సమ్మె నోటీసు ఇచ్చి 7 రోజులు సమ్మె చేస్తే ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చి హమాలీ రేట్లను పెంచుతూ జీఓ విడుదల చేసిందన్నారు. అనంతరం స్వీట్లు తినిపించుకుని సంబురాలు చేసుకున్నారు. హమాలీ రేట్లను రూ.26 నుండి రూ. 29లకు పెంచి జీఓ విడుదల చేసి వెంటనే బకాయి హమాలీ రేట్లను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గోడౌన్‌లలో పని చేసే మహిళలందరికీ ఒకేరకమైన వేతనం చెల్లించాలన్నారు. దసరా పండుగ సందర్భంగా ఇచ్చే బోనస్, ఇన్సెంటీవ్‌లను రూ.6500ల నుండి రూ.7500లకు పెంచి చెల్లిస్తామనడంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సమ్మె చేసే పరిస్థితి రాకుండా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, గోదాం మేస్త్రి అంజి, కార్మికులు రాజు,సుధాకర్, నవీన్, కిషన్, సురేష్, హమాలీ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఆశయంతో చదివి గుర్తింపు పొందాలి : కలెక్టర్

- కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సోఫినగర్ సమీపంలోని నిర్మల్ గ్రామీణం, సోన్ కేజీబీవీ పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ ఇతర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. అభ్యాసం, లక్ష్యాలు, సబ్జెక్ట్ ల వారీగా పాఠాలు బోధించి విద్యార్థులకు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో ఆందోళన లేకుండా విశ్వాసంతో ఉండాలని ప్రోత్సహించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివత్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీల కోఆర్డినేటర్ సలోమి కరుణ, ప్రత్యేక అధికారులు సుజాత, లతాదేవి, తహసిల్దార్ రాజు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగివుండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వాహన చోదకులందరికీ కంటి చూపు అత్యంత కీలకమన్నారు. అంతకుముందు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిర్మల్ ను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ముర్తాజ అలీ, రానాశ్రీ, అక్షయ్, రజనీకాంత్ లు, డిఎంహెచ్ఓ రాజేందర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ కుమార్, నిర్మల్ పట్టణ తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీకేటీయూలో మెరుగైన వసతులు కల్పించాలి

బాసర ఆర్జీకేటీయూలో మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ ఆర్జీకేటీయూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్సిటీలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, వర్సిటీ అభివద్ధి, మరమ్మత్తుల పనులన్నీ పూర్తి చేయాలని తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలను కొనసాగించి పరిశుభ్రతను పాటించాలన్నారు. వర్సిటీలో విద్యను అభ్యసించే విద్యార్థులందరికీ నాణ్యమైన రుచికరమైన, ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేసి భోజన మెనూలో వారి సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలో మహిళా శక్తి క్యాంటీన్ ల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలాన్నారు. దశల వారీగా విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తూ, సోలార్ విద్యుత్ వైపుకు మళ్లాలన్నారు. సమావేశంలో బాసర ఆర్జీకేటీయూ కార్యాలయ పర్యవేక్షకులు ప్రొఫెసర్ రణధీర్, భైంసా ఆర్డీఓ కోమల్ రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





కొనసాగుతున్న గ్రామ సభలు



నవతెలంగాణ-ముథోల్

ముథోల్‌తో పాటు రాంటెక్, చింతకుంట తదితర గ్రామాలలో గురువారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. రాంటెక్ గ్రామసభలో రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్నా జాబితాలో అర్హులైన వారి పేర్లు రాలేదని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. అనర్హుల పేర్లు వచ్చాయని ఆరోపించారు. తహసీల్దార్ శ్రీకాంత్ బదులిస్తూ అర్హుల పేర్లు వచ్చాయని, సాంకేతిక లోపంతో ఏమైనా కొందరి పేర్లు రాకుంటే ఆందోళన చెందవద్దని, గ్రామ పంచాయతీలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివకుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, ప్రత్యేక అధికారి రామారావు, ఏఓ రచన, ఏపీఓ శిరీషరెడ్డి, సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్, ఎంఈఓ రమణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహానీయుడు నేతాజీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ నగర సంచాలక్ డాక్టర్ కళ్యాణ్‌రెడ్డి అన్నారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 128వ జయంతిని నిర్వహించారు. నేతాజీచౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, ఎన్‌వైకే డైరెక్టర్ నాగేందర్‌గౌడ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, కోకన్వీనర్ నిఖిల్, జిల్లా హస్టల్ కన్వీనర్ మేకల మహేష్ పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని సొనాలలోని వివేకానంద పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమలాలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ జయంతులే తప్ప వర్ధంతులు లేని ఒకే ఒక్క మహనీయుడు, మహావీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

14 నుంచి గాంధారి ఖిల్లా జాతర



నవతెలంగాణ-ఉట్నూర్

ఫిబ్రవరి 14,15,16 తేదీలలో జరుపుకునే గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర గోడ ప్రతులను గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి ఖుష్బూ గుప్తా విడుదల చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, ఆదివాసీ నాయకులు రాజు కుమార్, మారినేని భూమేష్, దైనేని రమేష్, సాధంబాపు, పల్లె పృథ్వీరాజ్, దుబ్బ రాజయ్య, పల్లె మహేందర్, అశోక్, రఘుకుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



నవతెలంగాణ-ముథోల్

మండల పరిధిలోని భైంసా బాసర రహదారిపైన గురువారం సాయంత్రం ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనంను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన సంబంధిత పత్రాలను పరిశీలించారు. విధిగా హెల్మెట్ ధరించాలని ద్విచక్ర వాహనదారులకు సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు తలల పాము హల్‌చల్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ రూరల్ మండలంలోని కౌట్ల(కె)సిద్ధాపూర్ గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్నం రెండు తలల పాము హల్‌చల్ చేసింది. అటు గుండా వెళ్తున్న వాహన చోదకులు దానిని చూశారు. అది మెల్లగా సమీపంలోని చెరువులోకి జారింది. ఈ మధ్య ఈ ప్రాంతాలలో రెండు తలల పాము ప్రతిరోజు కనిపిస్తున్నాయని స్థానికులు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాత లైన్ మరమత్తులు పనుల్లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని జంగంవాడలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

విద్యార్థులు చదువులతో పాటు క్రీడారంగంలోనూ రాణించాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని అల్లంపెల్లి గ్రామంలో చిన్నజీయర్ సన్ రైజర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దట్టమైన కవ్వాల్ అరణ్యంలో అడవి బిడ్డలు చదువుకు దూరం కాకూడదనే మంచి ఉద్దేశంతో చిన్న జీయర్ స్వామి జీయర్ గురుకులాలను స్థాపించి నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. జీయర్ గురుకులాలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నాయన్నారు. ఉన్నత చదువులు చదువుకొని ఐఎఎస్, ఐపీఎస్, ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు కావాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది నుండి క్రీడల పోటీలను ప్రారంభించడం అభినందినీయమన్నారు. జీయర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. అల్లంపెల్లి వాయిపెట్, అంకెన రాయదారి గ్రామాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఈ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఖానాపూర్ నియోజవర్గంలోని కవ్వాల్ అభయారణ్యంలో పీసీసీఎఫ్ చీఫ్ రాకేష్ డోబ్రియాల్ పర్యటన ఉంటుందని అన్నారు. అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఆయన పర్యటన ఖరారు అయిందన్నారు. అల్లంపెల్లి గ్రామంతో పాటు గంగాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. నాలుగు పథకాలపై జరుగుతున్న గ్రామ సభలలో పేర్లు రాని వారు దిగులు చెందొద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రొద్దుటూరి సతీష్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ శైలజ రమేష్ రావు, మండల కాంగ్రెస్ నాయకులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్ల పెళ్లి రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ పీఠికను చదివించాలి



నవతెలంగాణ-బోథ్

విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగ పీఠికను చదివించాలని ధర్మ సమాజ్ పార్టీ మండలాధ్యక్షులు కొండమడుగు గణేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయం బాక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు పంపించామని అన్నారు. విద్యా సంస్థలలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిరోజు ప్రార్థనలో భాగంగా చదివించాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా ఉత్తరాలను పంపించన్నారు. భారతదేశ సమస్తాన్ని అది శాసన రూపంలో నడిపించే సుప్రీం పవర్ భారత రాజ్యాంగం ఇది అందరికీ తెలిసిన విషయమే అని కొనియాడారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ బోథ్ మండల ఉపాధ్యక్షులు కుందూరు సుధాకర్, ప్రధాన కార్యదర్శి బిక్క రమేష్, నామ్‌వాడే గజానంద్, లక్ష్మణ్, బద్రి నాయక్, నిఖిల్, అఖిల్, గొర్రె ఆకాష్, గొర్రె ఉదయ్, కుందూరు స్వామి, కుందూరు శ్రీనివాస్, మాకునూరి సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.

అడెల్లి ఆలయం వద్ద జంతుబలి నిషేధం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి శ్రీమహా పోచమ్మ దేవస్థానం వద్ద ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జంతుబలి మేకలు, గొర్లు, కోళ్ల కోయడాన్ని నిషేధించినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యాన్ని భక్తులు గమనించాలని పేర్కొన్నారు.

ఇల్లు లిస్ట్ కోసం తల్లాడుతున్న ప్రజలు

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం ఇందిరమ్మ ఇల్లు కోసం సర్వే చేసిన సంగతి అందరికీ తెలిసినదే. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసిన ఇందిరమ్మ ఇండ్ల జాబితా గురువారం ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ గోడలపై అతికించారు. గ్రామ పంచాయతీ అధికారులు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల పేర్లు గ్రామ సభలోనే చెప్పాలి. గోడపై అతికించడంతో రాత్రి పూట గ్రామ పంచాయతీలో ప్రజలు తల్లాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రజలకు తిప్పలు పడాల్సి వస్తోంది. ప్రజలకు ఇబ్బందులు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డా. అతిక్ బేగం మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆయన జయంతిని పరాక్రమ్ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిన విషయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, ఎన్ఎస్ఎస్ పీఓలు పథ్వీరాజ్, రేఖ, స్వప్న, గోపాల్, బోధన బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా అలవెన్సులపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్ సింగరేణిలో అమలు చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. భూగర్భగనులలో జాతీయ సంపద తీయుటకు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా, గ్యారెంటీ భరోసా లేని బతుకులతో రాష్ట్రానికి దేశానికి పరిశ్రమలకు వెలుగునిస్తున్న సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు రియంబర్స్‌మెంట్ కోల్ ఇండియా మాదిరిగా అలవెన్స్ లపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంట్ మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా ద్వారా సమావేశాల ద్వారా కార్మికులందరినీ చైతన్యపరిచి హక్కును సాధించుటకు అవిశ్రాంతమైన పోరాటం చేస్తామని తెలిపారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ భవిష్య (నిధి) సీఎంపిఎఫ్, జరిగిన కుంభకోణాలు, పెట్టుబడుల పేరుతో నిధుల మళ్లింపు చేసిన బాధ్యులైన వారిపైన సీబీఐ ద్వారా విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ప్రధాన కార్యాలయం ధన్బాదు నుండి హైదరాబాదుకు తరలించాలని కార్మికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి పరిశ్రమకు రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు సుమారు రూ.33 వేల కోట్ల చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యక్రమాలకు ఆకర్షితులైన శ్రీరాంపూర్ ఏరియా న్యూటెక్ కార్మికులకు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి మాదాసు రవీందర్, ఏరియా కార్యదర్శి రాజేందర్, ఏరియా కోశాధికారి గూడ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గొల్ల మహేందర్, వివిధ గనుల పిట్ కార్యదర్శులు గోనె రామకృష్ణ, మోతే ఓదెలు, కాంపల్లి తిరుపతి, సహాయక కార్యదర్శులు కుంట రాజు, చల్ల తిరుపతి, నాయకులు పోతరాజుల రాజేందర్, గసిగంటి రమేష్, బుర్ర అరుణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని భీమారం ఎస్సై శ్వేత తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం భీమారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. వాహనాలు నడుపుతున్న క్రమంలో నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా భవిష్యత్ లక్ష్యాలతో చదువుకోవాలని తెలిపారు. విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు ఆసక్తిగల ఆట పాటల్లో ప్రావీణ్యత సాధించాలని తెలిపారు. ఉత్తమ విద్యార్థులుగా గుర్తింపు తెచ్చుకోవడం ద్వారా విద్య నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి ఇతరులకు అవగాహన కల్పించాలని తెలిపారు.



ప్రస్తుతం సైబర్ నేరాలు అత్యధికంగా నమోదవుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేల కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తుండాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని మహాలక్ష్మీవాడలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రూ.85 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు మరమ్మతులు, రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్, రూ.కోటితో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ మంచి నీటి ట్యాంక్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ పరంగా మంజూరైన పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. పట్టణంలోని అనేక వార్డుల్లో సమస్యలున్నాయన్నారు. మంజూరైన రూ.11 కోట్లతో దశల వారీగా ప్రాధాన్య క్రమంలో వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అమృత్ పథకంలో రూ.300 కోట్లతో అండర్ డ్రైనేజీ, పైప్‌లైన్‌తో పాటు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ్, మహేందర్, ఆధినాథ్, స్వప్నిల్, ముకుంద్ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణం టేకుల బస్తీలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కౌన్సిలర్ ఎలిగేటి శ్రీనివాస్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా స్కూల్లో ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేగుంట రాయలింగు, నాయకులు బొలిశెట్టి సుధాకర్, పిల్లి ఆనంద్, వార్డు పెద్దలు రాజనర్సు, గంధం రాజేందర్ పాల్గొన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-సిరికొండ

పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం మండలానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వస్తున్నట్లు మాజీ ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని సుంకిడి, కుంటగూడ గ్రామాల్లో పలు అభివద్ధి ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా కర్తవ్య భోద దివస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని శిశుమందిర్‌లో తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదిన సందర్భంగా కర్తవ్య భోద దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపిక్రిష్ణ మాట్లాడుతూ భారతీయులలో దేశభక్తిని, స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన గొప్ప వీరుడు నేతాజీ అని అన్నారు. స్వాతంత్రం రావాలంటే సాయుధ పోరాటమే న్యాయమని ప్రతి భారతీయుడు ఒక సైనికుడిల పోరాడి భారతదేశానికి స్వాతంత్రం సాధించవచ్చు అనే నమ్మకాన్ని భారతీయులలో నిలపారన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ బాధ్యులు మెస్రం రాజ్ కుమార్, మనోజ్ రెడ్డి, వెంకట్ రాం రెడ్డి, మురళీ, దత్తాత్రి, రాజేశ్వర్, కేశవ్, గోపాల్, సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభల దరఖాస్తుల సమస్యలపై నిరసన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నిర్మల్ జిల్లా వైయస్సార్ కాలనీ ఆదివాసిగూడలో ఇండ్ల కొరకు సర్వే చేసిన లిస్టులో తమ పేర్లు రాకపోవడం, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారి పేర్లు జాబితాలో లేనందున ఈ నిరసన చేపట్టారు. ప్రభుత్వం గ్రామసభల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, గ్రామసభల నిర్వహణ తూ తూ మంత్రంగా జరుగుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, పారదర్శకతతో పని చేసి అర్హుల జాబితాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంబు, జిల్లా నాయకులు పంద్రం ఆనంద్ రావు, సోయం సూర్యభాన్, ఉయిక భీమ్ రావు పాల్గొన్నారు.

